# అమాయకత్వం

## — కోన శ్రీనివాసరావు

శాస్త్రి నీరసంగా రోడ్డుమీద నడుస్తున్నాడు. ఎండ మండిపోతున్నది సిమెంటు రోడ్డు కావటం మూలానేమో క్రిందినుంచి వేడి సెగలు గక్కుతున్నది.

శాస్త్రి అటూ, యిటూ చూశాడు "బోర్డేమైనా కనిపిస్తుందేమో!" అన్న ఆశతో. చుట్టుప్రక్కలెక్కడా కనబడలేదు కడుపులో పేగులు వెర్రికేకలేస్తున్నాయ్, సామాన్యుడి మనసులాగా "ఆకలోయ్ శాస్త్రీ" అంటూ.

హఠాత్తుగా గుర్తుకొచ్చింది కాంతం చదువుకునే విద్యార్థికి ముందుగా గుర్తొచ్చే నిరుద్యోగ సమస్యలా!

కడుపులో ఆకలి బయట ఎండ గుండెల్లో భయం- శరీరంలో వణుకు- అన్నీకలిసి అతన్ని చెమటతో ముంచెత్తేశాయి.

జేబురుమాల తీసి ముఖం తుడుచుకున్నాడు - బెల్‌బాటం ప్యాంటు వేసుకున్న యువకుడు - అంటీ అంటనీ దుమ్మును దులుపుకున్నట్లుగా.

ఇంట్లోనుంచి బయలుదేరేటప్పుడు కాంతం అన్న మాటలు గుర్తుకొచ్చాయి శాస్త్రికి.

"ఏమోయ్! యివాళ మాత్రం ఇల్లు దొరకపోతే వంటగూడా చెయ్యను జాగ్రత్త"- అన్న భార్య బెదిరింపు.

కాంతానికి యింటివాళ్ళ పోరెక్కువయింది మిల్లులో పనిచేసే కార్మికుడి మీద యజమాని అజమాయిషీకి మల్లే!

ఇంటావిడమీద తగని కోపం వచ్చింది కాంతానికి. తన సంసార విషయంలో జోక్యం చేసుకున్నందుకు.

"తను తనమొగుడు "ఏరా!" అని పిల్చుకుంటాం! లేకపోతే "ఏమోయ్" అనుకుంటాం! మధ్యలో యీమె కెందుకో," అని.

పి. జి. సెంటర్‌లో ప్రొఫెసర్ చెప్పిన పుస్తకాల పేర్లు వినీ వినీ విసుగ్గా (అంతకంటె ఏం చెప్పరు గనుక) - అలసిపోయి యింటికిచేరిన శాస్త్రిమీద విరుచుకుపడ్డది — ప్రతి చర్యకీ వ్యతిరేక దిశలో ప్రతిచర్య లేక రియాక్షన్ ఉంటుందనే — న్యూటన్ సిద్ధాంతంలా.

ఇల్లు ఖాళీ చేసేద్దామంటూ హుకుం జారీ చేసింది.

"సరేలే!" అన్నాడు తను — యజమాని ఆజ్ఞకు తలవంచి అంగీకరిస్తున్న పనివాడిలా!

నాలుగ్రోజుల్నుంచీ కాలేజీగూడా మానుకుని అదేపనిగా వెదుకుతున్నా ఆ మహానగరంలో రెండుగదుల పోర్షనే దొరకలేదు— తొమ్మిదవ తరగతి సైన్సు పుస్తకంలా.

శాస్త్రి ఎమ్ ఏ చదువుతున్నాడు ఇంగ్లీషు సబ్జక్టుతో. శాస్త్రి తాత ఉద్దండపండితుడు. తండ్రి తండ్రిని మించిన తనయుడు శాస్త్రి భార్యా విధేయుడు.

రెండు రోజుల క్రితం ఓ యింటి ముందు బోర్డు చూశాడు "టు లెట్!" అని

శాస్త్రి ముఖంలో ఉత్సాహం తొంగి చూసింది — బియ్యం కిలో రూపాయికి దొరికినప్పుడు సంతోషంలా!

గేటు తీసి లోపలకెళ్ళగానే అల్సేషియన్ కుక్క "భౌ"మంది — గవర్నమెంటు రూల్‌లాగా.

"ఏమండీ" — పిల్చాడు తను.

"ఏం కావాలి!" విసుగ్గా చూసాడో నడి

వయస్కుడు —

పోర్షన్ "రెంట్"కి కావాలండీ!" — శాస్త్రి అభ్యర్థన "ఉన్నది మీరు ఏం చేస్తుంటారు?" కోర్టులో ముద్దాయిని క్రాస్ఎగ్జామ్ చేసినట్లుగా.

"పి జి. సెంటర్‌లో ఎమ్మే చదువుతున్నా...."

శాస్త్రి మాట యింకా పూర్తిగాకుండానే "బోర్డులో రాసుంది! మేం స్టూడెంట్స్‌కివ్వం!" అంటూ వెళ్ళిపోయాడు.

మనిషికి స్వేచ్ఛవచ్చినట్టేవచ్చి, పోయినట్లుగా.

ఆయన చూపుల్లో గర్వం —

మాటల్లో హోదా -

నడకలో నాగరికత

నవ్వులో విలాసం కొట్టొచ్చినట్లున్నాయి.

శాస్త్రి కంగారుగా "సార్.... మీరు.... పొరబడు తున్నారు"

"అంటే .... మీ ఉద్దేశ్యం .... బోర్డులో "స్టూడెంట్స్‌కి" అని రాసుందంటారా"

"అదిగాదు సార్! నాకు "మారేజ్" అయింది. ఫామిలీతోనే ఉంటాను!"

దర్జాగా సోఫాలో కూర్చుని, చెర్లోబర్రె నుంచి కొమ్ములు బేరం చేసినట్లుగా — "మీరంత అదెపెట్టలేరేమో" అన్నాడాయన. పందొమ్మిదొందల డెభ్భైలో ప్రళయం వస్తుందని జ్యోతిష్యం చెప్పినట్లుగా.

సమాధానం యివ్వబోతున్న శాస్త్రి నాశికా రంధ్రాన్నొక క్రొత్తరకం వాసన పావనం చేసింది— మురికి పేటల్లో విద్యుల్లాగా.

"పలావ్!" అంది మనసు.

"చాలా బాగుంది" అనుకున్నాడు మనసులో.

"గయ్" మని లేచింది మనసు "నీ కుల మేమిట్రా!" అని.

గబగబా ముక్కు మూసుకుని వీధి దాటి పట్టాడు. విసుగుపుట్టి ఇంటి ముఖం పట్టాడు శాస్త్రి

అది నెలమధ్యలోనే అయినా — చేతిలో చిల్లి గవ్వగూడా లేదు శాస్త్రికి. అన్నయ్య పంపిన ముష్టి వంద రూపాయల్లో డెబ్భై రూపాయలు కాంతం జల్సాలు, సినిమాలకే చాలటం లేదు.

"ఏం! యివాళగూడా యిల్లు దొరకలేదా" అంది. వాకిట్లోనే — ఆఫీసులో చేరిన మొదటురోజే ఆఫీసర్ చేతిలో చివాట్లు తిన్నట్లుగా.

"దొరకలేదు! తొందరగా అన్నం పెట్టు ఆకలేస్తోంది" అన్నాడు శాస్త్రి.

"అన్నం వండలేదు" అని వెళ్ళి పడుకుంది కాంతం.

ఆమె ముఖంలో తన మీద నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందతనికి.

"అసలు నేను మొదట్నుంచి చెప్తున్నాను! ఆ టక్కూ గిక్కూ తీసేయండి! ఏ కులంగాని పిల్లో మిమ్మల్ని సులువుగా వల్లో వేసుకుంటుంది అనివింటేనా! అందుకే మీకు యిల్లు దొరకటం లేదు" అంది.

గబ గబా గదిలోకెళ్ళి నాలుగుచోట్ల చినిగిపోయిన తన టెరీకాటన్ పాంటు విప్పి గోడకు తగిలించి, లుంగీ చుట్టుకున్నాడు.

దేశంలో సిమెంటు కరువొచ్చింది. అందుకేగాబోలు శాస్త్రి పాంటుమీది సిమెంటు రంగు "ఉండలేను బాబోయ్" అంటూ పరుగెత్తి పోయింది. అసలు నా అనుమాన మేమిటంటే దాన్ని గూడా ఎవరైనా బ్లాక్ చేసేశారేమో! అని

దేశంలో ఫాక్టరీలు ఎక్కువైపోయాయి. దాని కారణంగా నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది వాతావరణ మంతా కలుషితమైంది పొగతో—ఆవేదనతో బీదవాడి హృదయంలా శాస్త్రి ఇంట్లో పొగ

బైటకిపోలేక శాస్త్రి బెంగ నావహించింది.

"సవ్" వెలిగించి ఎసరు పెడదామని ఉపక్రమించబోతుంటే — పేచీ పెట్టేసింది కాంతం — "వస్తులు మానాన్న యిచ్చిన డబ్బుల్లో కొన్నాను; వాడటానికి వీల్లేదు" అని.

"అలాగైతే స్టౌ నేను అన్నయ్య పంపిన వాటాతో కొన్నాను సౌ లేకుండా వస్తు లెందుకు" అన్నాడు.

వాడించుకున్న తర్వాత — విసిగిపోయి పాతగుడ్డ పీలికలు మూర్చి అన్నం వండుకుని తిన్నాడు.

కాంతానికి అహం దెబ్బతిన్నది.

దుఃఖం, రోషం రెండూ ఆక్రమించాయి హృదయంలో, పెద్దగా ఏడవటం ఆరంభించింది. శాస్త్రికి కోపం మించిపోయి ఒక దెబ్బగొట్టాడు.

తలగోడకేసి బాదుకోటం ప్రారంభించింది.

"గోడకి పెచ్చు లూడతాయేమో!" అనిపించింది శాస్త్రికి.

కాసేపు నడుం వాల్చాడు శాస్త్రికి.

"అయ్యగారున్నారా" అనుకుంటూ వచ్చాడు పోస్టుమాన్, చేతిలో మనియార్డర్ ఫారంతో.

అతన్ని చూసి, నవ్వుతూ చూసింది శాస్త్రి వైపు.

శాస్త్రి డబ్బులు తీసుకున్నాడు. పోస్టుమాన్ వెళ్ళిపోయాడు.

"ఏమండీ" నెమ్మదిగా పిలిచింది కాంతం.

"ఏమిట"న్నట్లుగా చూశాడు.

"బావా! నిన్ను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను గదూ!" అంది, మెల్లగా దగ్గర చేరుతూ—లాలింపుగా.

"ప్రేమించికాదు చేసుకుంది పొగరుతో" అన్నాడు కక్షగా. శాస్త్రి పళ్ళో తలదూర్చి ఏడ్చేసింది కాంతం.

జాలిపడ్డాడు శాస్త్రి.

సాయంత్రం అయింది.

"మంచి సినిమా వచ్చిందండీ! యివాళే వెళ్ళిపోతుందిట వెళ్దామండీ" అంది గోముగా.

"సరే" అన్నాడు శాస్త్రి. పది నిమిషాల్లో తయారై వచ్చింది. బయలుదేరారిద్దరూ — టాక్సీలో ఎక్కి హాలుకెళ్ళారు.

"బాక్సు"కి టిక్కెట్లు కొన్నారు. ఇద్దరూ "జాలీగా" సినిమా చూశారు వస్తూ వస్తూ, భోజనంచేసి యింటికి వచ్చి పడుకున్నారు.

శాస్త్రి అన్నయ్య పంపిన డెబ్బైరూపాయల్లో యిరవై అయిపోయాయి.

ప్రక్కన వచ్చి కూర్చుంది కాంతం.

తల తిప్పి చూశాడు.

"సినిమా బాగుంది గదూ!"

"బాగుంది!"

ఇలా కాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

"ఏమండీ! రేపాదివారం గదూ! హంపీ వెళ్ళి చూసొద్దామండీ!" అంటూ అతని గుండెలపై తలానించి అడిగింది.

"సరే"నంటూ దగ్గరికి తీసుకున్నాడు.

మర్నాడు బయలుదేరి వెళ్ళి మూడు రోజుల తర్వాత యిల్లు చేరుకున్నారు.

డబ్బుఅంతా అయిపోగా, యింకా చేతిలో అయిదు రూపాయలు మిగిలింది.

మళ్ళీ కాంతం పోరు మొదలు పెట్టింది — యింట్లోకి అవిలేవు! యివిలేవు! నన్నిక్కడ పస్తులుంచుతున్నారు" — అంటూ.

"ఈ యింట్లో ఉన్నంతకాలం దరిద్రం వెంటాడుతుంది! యింకోయిల్లు చూడండీ!" అని.

మళ్ళీ అన్వేషణ ప్రారంభించాడు శాస్త్రి, అమాయకంగా.